క్లుప్తంగా

ఓటు హక్కుపై అవగాహన



దాములూరు(ఇబ్రహీంపట్నం): రానున్న ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవాలని వెస్ట్ జోన్ డీసీపీ టి.హరికృష్ణ అన్నారు. దాములూరు గ్రామంలో గురువారం ఓటు హక్కుపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మీప్రాంతంలో ఉన్న రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లను బైండవర్ చేశామని చెప్పారు. ఎన్నికల నియమావళి నేపథ్యంలో ఏ కార్యక్రమానికైనా ముందస్తు అనుమతి తప్పనిసరి అని అన్నారు. ఎవరైనా ప్రలోభాలకు గురిచేసినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. సీ విజిల్ యాప్ వినియోగం, ఉపయోగాలపై అవగాహన కల్పించారు. సీఐ ఎం.సత్యనారాయణ, ఎస్ఐలు పాల్గొన్నారు.

కండెక్టర్‌కు ఆర్థిక సాయం

ఇబ్రహీంపట్నం: క్యాన్సర్‌కు గురై చికిత్స పొందుతున్న మహిళా కండక్టర్ యోగేశ్వరిని ఎన్ఎంయూఏ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు డిపో నాయకులతో కలిసి గురువారం పరామర్శించారు. డిపోలో యూనియన్ సభ్యులు, ఉద్యోగులు, మహిళా కండక్టర్లు సమకూర్చిన రూ.1.15 లక్షలను ఆమెకు అందజేశారు. రాష్ట్ర కోశాధికారి మోహన్, సీసీఎస్ బోర్డు డైరెక్టర్ ఎస్.అనంతరాములు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కార్యదర్శి రామకృష్ణ, బ్రాంచి నాయకులు పాల్గొన్నారు.

వేంకటాచలస్వామికి సహస్ర దీపాలంకరణ సేవ




తిరువూరు: ఫాల్గుణ మాసంలో శ్రవణ నక్షత్ర సందర్భంగా స్థానిక వేంకటాచలస్వామి ఆలయంలో గురువారం రాత్రి సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు దేవయాజనం వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి విశేషార్చనలు నిర్వహించిన అనంతరం భక్తబృందం సభ్యుడు నాగుబండి విశ్వేశ్వరరావు దంపతులు సహస్ర దీపాలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సైన్స్ అండ్ టెక్నాలజీపై జాతీయ సదస్సు



కేతనకొండ(ఇబ్రహీంపట్నం): ఇంజినీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో అడ్వాన్స్ ట్రెండ్స్‌పై కేతనకొండ ఆర్కే ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ స్థాయి సదస్సు జరిగింది. క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ కో–ఆర్డినేటర్ హరీష్, ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య గురువారం సదస్సును ప్రారంభించారు. ఇంజినీరింగ్ సాంకేతికతలో నూతన ఒరవడిని చేర్చేందుకు దేశంలోని వివిధ శాస్త్రవేత్తలు, పండితులు, పరిశోధకులను ఒకే చోటుకు చేర్చడమే సదస్సు ముఖ్య ఉద్దేశ్యమని వారు చెప్పారు. సబ్జెక్టులో సాంకేతిక విజ్ఞానం పెంచుకోవడంపై అవగాహన కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 350 మంది వారి పరిశోధనలను ప్రజెంట్ చేశారు. న్యాయనిర్ణేతలు ఉత్తమ ఆవిష్కరణలను ఎంపికచేశారు. ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్య, వైస్ ప్రిన్సిపాల్ సాయిరామ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఫండింగ్ ఆపర్చునిటీస్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మైలవరం: ఫండింగ్ ఆపర్చునిటీస్ ఫర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ అవకాశాన్ని అధ్యాపకులు సద్వినియోగం చేసుకోవాలని పార్మర్ సైంటిస్టు డాక్టర్ డి. రాధా ప్రసాదరాజు అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో ఫండింగ్ ఆపర్చునిటీస్ ఫర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ అంశంపై కళాశాల అధ్యాపకులకు గురువారం అవగాహన సదస్సు జరిగింది. రాధా ప్రసాదరాజు మాట్లాడుతూ రీసెర్చ్ ఫండింగ్ ప్రాజెక్టుల్లో ప్రభుత్వ ఏజెన్సీల గురించి, అవి ఏయే సమయాల్లో విడుదల అవుతాయి, రీసెర్చ్ ఫండింగ్ ప్రాజెక్ట్స్ ప్రపోజల్స్, పేటెంట్స్ పేపర్స్ ఎలా అప్లై చేయాలో విపులంగా వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు మాట్లాడారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రమేష్‌రెడ్డి, ఆర్ అండ్ డీ డీన్ డాక్టర్ ఎస్. పిచ్చిరెడ్డి, సీఎస్ఈ (ఏఐ అండ్ ఎంఎల్) విభాగాధిపతి డాక్టర్ ఎస్. జయప్రద, డీన్స్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మళ్లీ అవే పాట్లు





కొండపల్లిలో పింఛన్ కోసం సచివాలయం గదిలో వేచి ఉన్న లబ్ధిదారులు ; కొండపల్లి రెండో సచివాలయం వద్ద పింఛన్ కోసం బారులు తీరిన లబ్ధిదారులు

- చంద్రబాబు పాలనను గుర్తు తెచ్చుకుని ఆగ్రహం
- మండుటెండలో ఏమిటీ ఇబ్బందులు అంటూ బాబుపై ధ్వజం
- నీరసం, నిస్సత్తువతో ఉక్కిరిబిక్కిరి
- ఎందుకు బాబు ఇంత కక్ష అంటూ ఆవేదన
- ఇంటివద్ద పెన్షన్ ఇచ్చారని సీఎం వైఎస్ జగన్‌పై ప్రశంసలు

ఇబ్రహీంపట్నం: పింఛన్ల కోసం వృద్ధులు, దివ్యాంగులు పడరానిపాట్లు పడుతున్నారు. ఐదేళ్లుగా ప్రతి నెలా ఒకటో తేదీన ఠంచనుగా వలంటీర్ల ద్వారా ఇంటి వద్దే పింఛను సొమ్ము అందుకున్న అవ్వాతాతలు, దివ్యాంగులు, ఇతర సామాజిక పింఛనుదారులకు కూటమి నాయకుల కుట్రలతో ఇబ్బందులు తప్పడం లేదు. సచివాలయాలకు వెళ్లి పింఛన్లు తీసుకోవాల్సి రావడం, ఎండ వేడిమితో ఉక్కిరిబిక్కిరయ్యారు. ఎందుకు బాబు మాపై ఇంత కక్ష అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. మాకు ఏ కష్టం తెలియకుండా ఇంటివద్దకే పింఛన్లు పంపించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చల్లగా ఉండాలని, ఆయనే మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని మనసారా ఆశీర్వదించారు. రెండో రోజు గురువారం ఉదయం పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. కొన్నిచోట్ల గంటల కొద్దీ గదిలో కూర్చోబెట్టారు. మరికొన్ని సచివాలయాల్లో క్యూలైన్‌లో నిలబెట్టారు. పింఛన్‌దారులు ఎక్కువమంది ఉండటంతో లైన్లలో నిల్చునేందుకు వృద్ధులు, దివ్యాంగులు అనేక ఇబ్బందులు పడ్డారు. దీర్ఘకాలిక వ్యాధుల వారు లైన్‌లో నిల్చోలేక టీడీపీ నేతలపై తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆనాటి అవస్థలు మళ్లీ కనిపించాయి



గత నెల వరకు ఒకటో తేదీన ఇంటితలుపు తట్టి పింఛన్ ఇచ్చారు. వాటితో అవసరమైన మందులు, ఇంటి సరుకులు తెచ్చుకునే వాళ్లం. గత టీడీపీ పాలనలో పింఛన్ కోసం రెండు, మూడు రోజులు మండుటెండలో తిరిగేవాళ్లం. మరలా చంద్రబాబు నిర్వాకంతోనే ఇప్పుడు ఎండలో పడిగాపులు పడాల్సి వచ్చింది. ఇంటి వద్దనే పింఛను ఇవ్వాలి.

– షేక్ బషీర్, పింఛన్‌దారుడు, కొండపల్లి

మేము బాగుండటం బాబుకు ఇష్టంలేదు



టీడీపీ నేతలకు ఓటమి భయం పట్టుకుంది. అందుకే వలంటీర్లపై కక్ష గట్టారు. తెల్లవారుజామునే ఇంటికొచ్చి అవ్వా తాతలను బాగున్నావా అంటూ పలుకరించి పింఛన్ నగదు ఇవ్వడమే వారు చేసిన తప్పా. మేము బాగుండటం ఇష్టంలేని చంద్రబాబు మమ్మల్లను కష్టాలు పెడుతున్నాడు. ఆయనకు ఓటేస్తే మరిన్ని కష్టాలు కొనితెచ్చుకున్నట్లే. మంచిచేసిన వారినే ఎన్నికల్లో ఆదరిస్తాం.

– జొన్నలగడ్డ సాంబశివరావు, పింఛన్‌దారుడు, మూలపాడు

మంచి చేసే వారిని ఎన్నుకోండి

- కూటమి మాయమాటలు నమ్మవద్దు
- మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తిరుపతిరావు



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సర్నాల తిరుపతిరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని ఐదేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనను, అంతకు ముందు చంద్రబాబు పాలనను బేరీజు వేసుకుని ఎవరి వల్ల మంచి జరిగిందో ఆలోచించండి. ఏ ప్రభుత్వ హయాంలో మీ కుటుంబ జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయో గమనించండి. మంచి చేసే మనసున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మీకు మేలు జరిగిందని అనుకుంటేనే ఆయనకు ఓటేసి మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని వైఎస్సార్ సీపీ మైలవరం ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు కోరారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామం కరకట్ట ప్రాంతంలో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. పింఛన్లు అందించే విషయంలో ఇప్పటి వరకు ఎటువంటి సమస్య లేదని, ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారు జాము నుంచే తలుపుతట్టి అందిస్తున్న వలంటీర్లను చంద్రబాబు అండ్ కో అడ్డుకోవడం వలన ఇప్పుడు ఇబ్బందులు పడుతున్నామని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు.

కూటమి నేతల కుట్రతోనే ఇబ్బందులు..

తిరుపతిరావు మాట్లాడుతూ లబ్ధిదారుల ఇంటి వద్దే పింఛన్ల పంపిణీని అడ్డుకున్న ద్రోహి చంద్రబాబు అని విమర్శించారు. పేదలకు సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా చేస్తున్న మేలును చూసి ఓర్వలేని చంద్రబాబు, పవన్ కల్యాణ్, కూటమి నాయకులు కుట్ర పన్ని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారని, ఇది తాత్కాలికమేనని, మళ్లీ జగనన్న ప్రభుత్వం రాగానే వలంటీర్లు వేకువ జామునే ఇంటికి వచ్చి పింఛన్లు ఇస్తారని చెప్పారు. సంక్షేమ పథకాలు ఇలానే కొనసాగాలన్నా సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

పెత్తందార్లపై పేదలదే విజయం

రానున్న ఎన్నికల్లో కూటమి పక్షాన పోటీలో నిలబడిన కోటీశ్వర్లు అయిన పెత్తందార్లపై సీఎం జగనన్న నిలబెట్టిన తనవంటి సామాన్య పేదలదే విజయమని సర్నాల తిరుపతిరావు అన్నారు. తమ వెనుక కోట్ల రూపాయలు లేకపోయినా అంతకు మించి విలువలు, విశ్వసనీయతగల సీఎం జగనన్న ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల యుద్ధంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాటిస్తున్న ధర్మమే గెలుస్తుందని, చంద్రబాబు కూటమి సమాధికాక తప్పదని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి సీఎం వైఎస్ జగన్



తిరువూరు 4వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సుధారాణి

తిరువూరు: రాష్ట్రంలో గతంలో ఎన్నడూ ఏ ప్రభుత్వమూ చేపట్టనన్ని సంక్షేమ పథకాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని కృష్ణా జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి అన్నారు. స్థానిక నాలుగో వార్డులో గురువారం వైఎస్సార్ సీపీ అభ్యర్థి స్వామిదాసు గెలుపును కాంక్షిస్తూ ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ రహితంగా అందరికీ సంక్షేమ ఫలాలు అందాలనే విశాల దృక్పథంతో ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన పథకాలు దేశంలోని ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్నాయని పేర్కొన్నారు. అత్యంత ప్రజాదరణ కలిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై బురద చల్లడానికి ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలను ప్రజలే తిప్పికొట్టాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ, వార్డు కౌన్సిలర్లు పాలం రమాదేవి, పరసా శ్రీనివాసరావు, తంగిరాల వెంకటరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు గజ్జల సీతారామారావు, మైనారిటీ నాయకులు గాలిబ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగనన్నతోనే సమగ్రాభివృద్ధి, సంక్షేమం

మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ప్రతాప్ అప్పారావు

ముసునూరు: జగనన్నకు మళ్లీ అధికారం ఇస్తేనే రాష్ట్రంలో సంక్షేమ రాజ్యం వర్ధిల్లుతుందని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. వలసపల్లి, యల్లాపురం, బలివే గ్రామాల్లో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనలో ప్రజలకు జరిగిన మేలును వివరించారు. వలసపల్లి, యల్లాపురం, బలివే గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, నూతన వాటర్ ట్యాంకులు నిర్మించి, పైపులైన్లు వేయించి, అంతర్గత సీసీ రహదారులు అభివృద్ధి చేయించామన్నారు. నియోజకవర్గ ప్రజల కల బలివే వద్ద చెక్‌డ్యాం కమ్ బ్రిడ్జి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. స్థానిక యువకులు జగనన్న ప్రచార పాటలకు డ్యాన్సులు వేసి, బాణసంచా, బైక్ ర్యాలీతో సందడి చేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నాగవల్లేశ్వరరావు, యూత్ అధ్యక్షుడు గూట్రు రంగారావు, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ బర్మా సీతారామయ్య, ఎంపీపీ కొండా దుర్గాభవాని, జెడ్పీటీసీ సభ్యులు డా.వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, సర్పంచ్‌లు దామోదర్, రావు ప్రవీణసుధాకర్, ఉప సర్పంచ్‌లు దారగాని సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యులు దాసి రాటాలు, సొసైటీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులతో సోదరభావం పెంపు



ఇఫ్తార్ విందుకు హాజరై నమాజు చేస్తున్న చంటినాయన

నూజివీడు: ఇఫ్తార్ విందులతో సోదరభావం, ఐకమత్యం పెంపొందుతాయని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకులు మేకా వేణుగోపాల అప్పారావు (చంటినాయన) అన్నారు. ఎమ్మార్ అప్పారావు కాలనీలో గురువారం రాత్రి ముస్లింలు నిర్వహించిన ఇఫ్తార్ విందులో చంటినాయన పాల్గొని మసీదులో ప్రార్థనలు చేశారు. అనంతరం నిర్వాహకులు చంటినాయనను ఘనంగా సత్కరించారు. కౌన్సిలర్ షేక్ రజియాబేగం, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు రామిశెట్టి మురళీకృష్ణ, వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

60 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు

నూజివీడు ఆర్డీఓ వై.భవానీ శంకరి



నూజివీడు: వచ్చే నెలలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలపై విశ్లేషణ పూర్తయింది. ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ ప్రక్రియకు సంబంధించి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. నియోజకవర్గంలో మొత్తం 286 పోలింగ్ కేంద్రాలు ఉండగా, వాటిలో 60 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించినట్లు నూజివీడు ఆర్డీఓ, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వై.భవానీశంకరి చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో క్షేత్రస్థాయి పరిస్థితులు, సమస్యలు, గతంలో జరిగిన ఎన్నికలప్పుడు చోటు చేసుకున్న ఉద్రిక్త ఘటనలు, గొడవలు వంటి వాటి ఆధారంగా సమస్యాత్మక కేంద్రాలను గుర్తించామని చెప్పారు. అయితే పోలింగ్ ప్రక్రియను పరిశీలించేందుకు, గొడవలు జరగకుండా ఉండేందుకు గాను మొత్తం 286 పోలింగ్ కేంద్రాల్లో 143 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీటిల్లోనే సమస్యాత్మక కేంద్రాలు కూడా ఉంటాయని చెప్పారు. సమస్యాత్మక గ్రామాల్లో ఇప్పటికే పోలీసు అధికారులు కేంద్ర సాయుధ బలగాలతో పోలీసు కవాతును సైతం నిర్వహించారన్నారు. అలాగే ఓటర్లు స్వేచ్ఛగా ఓటేసేందుకు అవసరమైన ప్రశాంత వాతావరణం ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల వద్ద ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేస్తామన్నారు. అంతేగాకుండా పోలింగ్ స్టేషన్ నుంచి 200 మీటర్ల వరకు రాజకీయ పార్టీల నాయకుల ప్రచారం జరగకుండా నిషేధాజ్ఞలుంటాయన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని ఆర్డీఓ విజ్ఞప్తి చేశారు.

పాఠశాలకు ప్రింటర్ బహూకరణ

లింగాల(గంపలగూడెం): లింగాల ప్రాథమికోన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన కాసర వెంకటరెడ్డి రూ.20 వేల విలువైన ప్రింటర్‌ను గురువారం హెచ్ఎం వేముల రమేష్‌కు అందజేశారు. దాతను ఉపాధ్యాయులు సన్మానించారు. న్యాయవాది అంకిరెడ్డి అంజనారెడ్డి, పైడిమర్ల కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న విజయాన్ని ఎవరూ ఆపలేరు

ఆగిరిపల్లి: పేదలకు అండగా నిలిచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయాన్ని ఎవరూ ఆపలేరని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు అన్నారు. గురువారం స్థానిక ఆగిరిపల్లి దళితపేటలో ఇంటింటా ప్రచార కార్యక్రమం నిర్వహించి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మరోసారి ఎమ్మెల్యేగా మేకా వెంకట ప్రతాప్ అప్పారావుని గెలిపించాలని ప్రజలను కోరారు. ఎంపీటీసీ సాదం గోపి, పీఏసీఎస్ డైరెక్టర్ అంజయ్య, ఎస్సీ సెల్ నాయకులు ఆదాం, బొబ్బర్ల సురేష్, కంబాల ప్రదీప్, వైఎస్సార్ సీపీ నాయకులు నక్కనబోయిన పండు, సక్కేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు చిమట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బీసీలు సమష్టిగా పనిచేయాలి

ఎ.కొండూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తీసుకువచ్చేందుకు బీసీలంతా ఐక్యంగా పనిచేయాలని బీసీ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు డి. శివశంకర్ అన్నారు. ఎ.కొండూరు చైతన్యనగర్‌లో గురువారం శివశంకర్ విలేకరులతో మాట్లాడారు. బీసీలు అంటే వెనుకబడిన వర్గాలు కాదని, బ్యాక్‌బోన్‌గా భావించి బీసీలకు సీఎం వైఎస్ జగన్ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి బీసీ కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేశారన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు, విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని నానిలను అత్యధిక మెజార్టీతో గెలిపించే బాధ్యత మనందరిపై ఉందన్నారు.

వైఎస్సార్ సీపీకే ప్రజాదరణ

తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి స్వామిదాసు

తిరువూరు: ఎన్నికల్లో ప్రజాదరణ లేక కుట్రలతో గెలవాలని తెలుగుదేశం కూటమి యత్నిస్తోందని వైఎస్సార్ సీపీ తిరువూరు ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. గురువారం తిరువూరు నగర పంచాయతీ పరిధిలోని 11వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేదలకు ప్రభుత్వం అందిస్తున్న సామాజిక పెన్షన్లను సైతం అడ్డుకోవాలని ప్రయత్నించి కూటమి నాయకులు విఫలమయ్యారన్నారు. వలంటీర్లను విధులకు దూరంగా ఉంచినా ప్రభుత్వం విజయవంతంగా పేదలకు పెన్షన్ సొమ్ము పంపిణీ చేయగలిగిందని చెప్పారు. ఇంకా ఇటువంటి కుయుక్తులు ఎన్నికలయ్యే వరకు పన్నుతూనే ఉంటారని, ప్రజలు అప్రమత్తంగా ఉండి వైఎస్సార్ సీపీకి అండగా ఉండాలని కోరారు. ప్రజాదరణ వైఎస్సార్ సీపీకే ఉందన్నారు. తిరువూరు నియోజకవర్గం ఎల్లలు తెలియని వారు ఇక్కడి ప్రజల్ని ఉద్ధరిస్తామని తిరుగుతున్నారని, టక్కు టమార విద్యలతో ఓటర్లను ప్రలోభ పెడుతున్నారని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరుస్తున్నందున ఓటర్లు మరోసారి ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ, నగర పంచాయతీ కౌన్సిలర్లు కాకర్లమూడి సుందరకుమార్, పరసా శ్రీనివాసరావు, తంగిరాల వెంకటరెడ్డి, మూడు దుర్గారావు, మోదుగు ప్రసాద్, పరసా సత్యనారాయణ, ఇనపనూరి చిన్నారి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కాలసాని విజయలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు గజ్జల సీతారామారావు, నాగేశ్వరరావు, గాలిబ్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పింఛన్ల పంపిణీ



నూజివీడు నెహ్రూపేటలో పింఛన్ నగదును ఇస్తున్న సచివాలయ సిబ్బంది

నూజివీడు: చంద్రబాబు ఎన్ని కుయుక్తులు పన్నుతున్నా ప్రభుత్వం సమర్థవంతంగా చర్యలు తీసుకోవడంతో పింఛన్ల పంపిణీ సజావుగా సాగుతోంది. వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు పడకుండా ప్రతి సచివాలయం వద్ద టెంట్‌లు, కుర్చీలను వేయడంతో పాటు ఎండ తీవ్రతకు ఎవరైనా అనారోగ్యానికి గురైతే వెంటనే చికిత్సను అందించేందుకు ఏఎన్ఎంలను సైతం నియమించారు. వారి దగ్గర మందులతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లను సైతం ఉంచారు. పట్టణంలోను, నూజివీడు మండలంలోను గురువారం పింఛన్ల పంపిణీ కొనసాగింది. సచివాలయాల వద్దకు పింఛన్‌దారులు వచ్చి నగదును తీసుకువెళ్లారు. పట్టణంలోని 16 సచివాలయాల వద్ద, మండలంలోని 25 గ్రామ సచివాలయాల వద్ద పింఛన్ల పంపిణీ నిర్వహించారు. పట్టణంలో మొత్తం 5,357 పింఛన్లు ఉండగా, రెండు రోజుల్లో 4,754 పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో మొత్తం పింఛన్లు 10,736 ఉండగా వాటిల్లో 9,794 పింఛన్లను పంపిణీ చేశారు. దీంతో పట్టణంలో 89 శాతం, మండలంలో 91 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయింది. అస్వస్థతతో రాలేని వారికి, మంచంపై ఉన్న వారికి సచివాలయ సిబ్బంది ఇంటికి వెళ్లి ఇవ్వనున్నారు. వృద్ధులకు ఎండ నుంచి ఇబ్బంది లేకుండా ప్రతి సచివాలయం వద్ద టెంట్‌లను, కుర్చీలను ఏర్పాటు చేశారు.

గంపలగూడెం మండలంలో..

గంపలగూడెం: సామాజిక ఫించన్ల పంపిణీ కార్యక్రమం గురువారం మండలంలో 84 శాతం పూర్తయిందని ఎంపీడీఓ తెలిపారు. ఇప్పటి వరకు రూ. 1.87 కోట్లు పంపిణీ చేశామన్నారు.

మండలంలో 90 శాతం పంపిణీ

ఆగిరిపల్లి: మండలంలోని 19 సచివాలయాలలో గురువారం వరకు 90 శాతం పింఛన్ల పంపిణీ జరిగిందని ఎంపీడీఓ శామ్యూల్ తెలిపారు. మొత్తం 9,882 మంది లబ్ధిదారులకు గాను 8,893 మందికి పింఛన్లు అందజేశామని, శుక్రవారం మిగిలిన వారికి అందజేస్తామన్నారు.

మైలవరం మండలంలో..

మైలవరం: మైలవరం మండలంలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఇతర సామాజిక పింఛన్ల పంపిణీ 90 శాతం పూర్తయిందని ఎంపీడీఓ పి. శ్రీనివాస్ తెలిపారు. మైలవరం మండలంలో మొత్తం 8,846 మంది లబ్ధిదారులు ఉండగా రెండు రోజుల్లో 7,960 మందికి పంపిణీ చేశామని వివరించారు.

44 మంది గ్రామ వలంటీర్ల రాజీనామా



రాజీనామా పత్రాలను సెక్రటరీ గోపీకృష్ణకు అందజేస్తున్న వలంటీర్లు

ఎ.కొండూరు: ఎ. కొండూరు మండలం, ఆగిరిపల్లి గ్రామాల్లో 44 మంది వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. ఎ.కొండూరు మండలంలోని చీమలపాడు, పెద్దతండా గ్రామాల్లో గ్రామ వలంటీర్లుగా పనిచేస్తున్న 16 మంది గురువారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను చీమలపాడు గ్రామ సచివాలయ సెక్రటరీ గోపీకృష్ణకు అందించారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ పింఛన్ లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా ప్రతి నెలా ఒకటో తేదీన వారి ఇంటికి వెళ్లి అందిస్తుంటే ప్రతిపక్ష రాజకీయ నాయకులు పింఛన్లు పంపిణీ చేయకుండా అడ్డుకున్నారని చెప్పారు. దీనితో ఈనెల పింఛను తీసుకునేందుకు లబ్ధిదారులు ఎన్నో ఇబ్బందులకు గురయ్యారని చెప్పారు. ప్రజలకు సేవ చేస్తుంటే రాజకీయ పార్టీల నాయకులు నిందలు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తామంతా స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నామని చెప్పారు.

ఈదర గ్రామంలో..

ఆగిరిపల్లి: ఈదర గ్రామానికి చెందిన 28 మంది వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. పంచాయతీ కార్యదర్శి బొల్లినేని ప్రసాద్‌కు రాజీనామా పత్రాలను అందజేశారు. ప్రజలకు స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్న తమపై అసత్య ఆరోపణలు చేసి ఎన్నికల కమిషన్‌కు టీడీపీ నాయకులు వారి అనుచరులతో ఫిర్యాదు చేయడంపై నిరసన వ్యక్తం చేస్తూ తామంతా రాజీనామా చేశామని వారు తెలిపారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

నియోజకవర్గ పరిశీలకుడు హర్షవర్ధన్‌రెడ్డి

జి.కొండూరు: వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేయాలని వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ పరిశీలకుడు కర్రా హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. జి.కొండూరు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులతో ఆయన ఆత్మీయ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల యాక్షన్‌ప్లాన్‌పై నాయకులకు దిశానిర్దేశం చేశారు. హర్షవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ స్థాయిలో నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకొని రాష్ట్ర ప్రభుత్వం ఈ ఐదేళ్లలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించాలని సూచించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతి ఒక్కరూ సైనికుడిలా పని చేయాలని వివరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీఎస్ఓలో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



బహుమతులు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ రత్నదుర్గ, ఉపాధ్యాయులు

మైలవరం: మైలవరం శ్రీచైతన్య హైస్కూల్ విద్యార్థులు ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ ఎగ్జామ్ ఇండియా స్థాయిలో జరిగిన పోటీలో ప్రతిభ కనబరిచారని పాఠశాల ప్రిన్సిపాల్ రత్నదుర్గ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫైనల్ స్థాయిలో జరిగిన పోటీలో మొదటి బహుమతి, ద్వితీయ బహుమతి, తృతీయ బహుమతి ఇద్దరు, 4వ బహుమతి ఇద్దరు, 5వ బహుమతి ఇద్దరు, స్పెషల్ బహుమతులు నలుగురు, కన్సోలేషన్ బహుమతులు 36 మంది, గోల్డ్ మెడల్స్ 25 మంది, మెరిట్ సర్టిఫికెట్లు 242 తమ విద్యార్థులు సాధించారని ప్రిన్సిపాల్ తెలిపారు. మొదటి బహుమతిని బి. నికిత 6వ తరగతి, ద్వితీయ బహుమతిని విలియం నాలుగో తరగతి గెలుచుకున్నాడన్నారు. మూడో బహుమతిని ఎన్. లోహిత్ సాయి క్రితిక్, ఎన్. తేజశ్విని స్మార్ట్ వాచ్‌లు గెలుచుకున్నారని తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ రత్నదుర్గ, డీన్ తాతారావు, సి–బ్యాచ్ ఇన్‌చార్జి సాంబశివరావు, ప్రైమరీ ఇన్‌చార్జి లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.